
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శనివారం 30 మార్చి 2024

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ అవశ్యకత, , తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం, పరిపాలనలో నూతన ఒరవడి, మహిళలు, బీసీలకు రాజకీయ ప్రాధాన్యం గురించి సీనియర్ నాయకులు వివరించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



జీకే వీధి మండలం దేవరపాలెం చర్చి వద్ద శిలువలను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు శిలువపై వున్న కాలం.. అంటే మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు మరణానికి చిహ్నంగా క్రైస్తవులు చెక్కలతో చేసిన శిలువలను చర్చిల వద్దకు తీసుకొచ్చారు. పలుచోట్ల శిలువలను ప్రదర్శిస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఏసుప్రభువు ప్రాణ త్యాగానికి, ప్రేమకు, క్షమాగుణానికి ప్రతీక గుడ్ ఫ్రైడే అని పాస్టర్లు వివరించారు.



చింతపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు

ఐదేళ్లుగా పునాదుల్లోనే..

కలగానే మిగిలిన చింతపల్లి రెవెన్యూ కార్యాలయం నూతన భవనం

- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 లక్షలు మంజూరు
- పునాదుల దశలో మారిన ప్రభుత్వం
- 25 శాతం పనులు పూర్తికాలేదని టెండర్ రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం
- అప్పటి నుంచి కదలిక లేని పనులు
- కాంట్రాక్టర్‌కు రూ.8 లక్షల బిల్లు బకాయి
- కొవిడ్ బారిన పడి చికిత్సకు డబ్బులు లేక మృతి



పునాదులకే పరిమితమైన రెవెన్యూ కార్యాలయం నూతన భవనం.. ఐదేళ్ల నుంచి ఇదే పరిస్థితి!

చింతపల్లి, మార్చి 29:

చింతపల్లిలో నూతన రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణాలు ఐదేళ్ల నుంచి పునాదుల్లోనే వుండిపోయాయి. టీడీపీ హయాంలో ఈ భవన నిర్మాణం చేపట్టగా, గత ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు.. 25 శాతం కన్నా తక్కువ పనులు అయ్యాయంటూ టెండర్‌ను రద్దు చేశారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2018 ఆగస్టులో చింతపల్లి తహసీల్దారు కార్యాలయానికి నూతన భవన నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలను హౌసింగ్ శాఖ(ప్రాజెక్ట్)కి అప్పగించింది. అత్యాధునిక సదుపాయాలతో ఈ జీ ప్లస్ వన్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, అదే ఏడాది పనులు కూడా ప్రారంభించారు. నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ సుమారు రూ.8 లక్షలు వెచ్చించి పునాదుల వరకు పనులు పూర్తిచేశారు. పిల్లర్ల నిర్మాణానికి సామగ్రి సిద్ధం చేశారు.

ఇదే సమయంలో సాధారణ ఎన్నికల జరిగి, వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2019 ఏప్రిల్ ఒకటో తేదీనాటికి 25 శాతం కన్నా తక్కువ జరిగిన అభివృద్ధి పనులను ఆపేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో చింతపల్లి రెవెన్యూ కార్యాలయం నూతన భవనం నిర్మాణాల టెండర్‌ను అధికారులు రద్దు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ భవన నిర్మాణానికి మళ్లీ టెండర్లు పిలవలేదు.. పాత కాంట్రాక్టర్‌తో పనులు చేయించలేదు.. అప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి బిల్లు చెల్లించలేదు.



ప్రస్తుతం రెవెన్యూ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న పాత భవనం

కాగా రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణ టెండర్‌ను ప్రభుత్వం రద్దుచేయగా, అప్పటి వరకు ఖర్చు చేసిన రూ.8 లక్షలను విడుదల చేయాలని కాంట్రాక్టర్ శెట్టి తిరుమలేశ్వరరావు పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. కాగా ఇతను 2021లో కొవిడ్ బారినపడి చికిత్సకు డబ్బులు లేని దయనీయ స్థితిలో మృతిచెందాడు.

అత్యాధునిక సౌకర్యాలతో రూపకల్పన

అత్యాధునిక సౌకర్యాలతో నూతన రెవెన్యూ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం రూపకల్పన చేసింది. మండల పరిషత్ ఆవరణలో రెవెన్యూ శాఖ స్థలంలో 3,792 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ భవనాన్ని నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో తహసీల్దార్ ... మిగతా 6వ పేజీలో

సస్పెన్స్‌కు తెర!

- పాడేరు టీడీపీ అభ్యర్థిగా వెంకట రమేశ్‌నాయుడు
- చివరి జాబితాలో ప్రకటించిన అధినేత చంద్రబాబు



ఈ ఏడాది జనవరి 4న చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన రమేశ్‌నాయుడు (ఫైల్)



కె.వెంకట రమేశ్‌నాయుడు

పాడేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థి పేరును తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం ప్రకటించారు. పాతపాడేరుకు చెందిన కిల్లు వెంకటరమేశ్‌నాయుడుకు టికెట్ కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఉపాధ్యాయ వృత్తిలో వున్న ఇతను రాజకీయాలపై ఆసక్తితో ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ఏడాది జనవరి నాలుగో తేదీన చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పొత్తులో భాగంగా పాడేరు సీటును బీజేపీకి కేటాయించినట్టు ప్రచారం జరగ్గా.. రెండు రోజుల క్రితం అనూహ్యంగా అరకులోయ సీటుకు బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. అంతే అనూహ్యంగా పాడేరు టికెట్‌ను వెంకటరమేశ్‌నాయుడుకు టీడీపీ కేటాయించింది. దీంతో పాడేరు స్థానంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయాలని భావించిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలు ఎవరికి కేటాయిస్తారన్నదానిపై కొన్నాళ్ల నుంచి చర్చ సాగుతోంది. అరకులోయ నుంచి పోటీ చేయాలన్న ఉద్దేశంతో సియ్యారి దొన్నుదొర పేరును పార్టీ అధినేత చంద్రబాబునాయుడు జనవరిలోనే ప్రకటించారు. ఇక పాడేరు విషయానికి వస్తే.. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేయగా, పొత్తులో భాగంగా పాడేరు సీటును బీజేపీకి కేటాయించారు. ఈసారి కూడా పాడేరు అసెంబ్లీ సీటును బీజేపీకే కేటాయిస్తారని ప్రచారం జరిగింది. దీంతో కురుసా ఉమామహేశ్వరరావు పేరు తెరపైకి వచ్చింది. కానీ అనూహ్యంగా అరకులోయ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో పాడేరు నుంచి టీడీపీ పోటీ చేయడం ఖాయమైంది. కాని టికెట్ ఎవరికి దక్కుతుందన్నదానిపై తీవ్ర చర్చ జరిగింది. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా వున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎంవీవీప్రసాద్, టీచర్ ఉద్యోగాన్ని వదిలి టీడీపీలో చేరిన కిల్లు వెంకట రమేశ్‌నాయుడు టీడీపీ టికెట్ కోసం పోటీ పడ్డారు. దీంతో టీడీపీ అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా ఈ ముగ్గురిపై ప్రజాభిప్రాయసేకరణ చేసింది. ఈ క్రమంలో అనూహ్యంగా కిల్లు వెంకట రమేశ్‌నాయుడు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు జాబితాను విడుదల చేశారు.



ఐపీఎల్ సందడి

విశాఖ చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు

- ఇరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రేపు
- నేడు నెట్ ప్రాక్టీస్ - 7లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.13
సహరి (ఆది)	4.39

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సకాలంలో సౌకర్యాలు కల్పించాలి

- డీఈవో పి.బ్రహ్మాజీరావు



ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, మార్చి 29: ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, విద్యార్థులకు సకాలంలో మెరుగైన సౌకర్యాలను అందించేందుకు పాఠశాలల హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు సూచించారు. పాడేరు డివిజన్‌కు చెందిన హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు శుక్రవారం ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై ఇక్కడ నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలను (దివ్యాంగులు) పుట్టిన వెంటనే ఎలా గుర్తించాలి, వారి పనులు వారే చేసుకొనేలా ఎలా సహకరించాలి, వారికి విద్యాబుద్ధులు ఏవిధంగా నేర్పాలి, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల గురించి వివరించడంతోపాటు ఎలా పొందాలన్న అంశాలు, స్కూల్ విద్యార్థులకు అందించే అలవెన్స్‌ల గురించి వివరించారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆయా పాఠశాలల పరిధిలో పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లి గీతకు శాలువా కప్పి సత్కరిస్తున్న గిడ్డి ఈశ్వరి

కొత్తపల్లి గీతను కలిసిన గిడ్డి ఈశ్వరి

పాడేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అరకులోయ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి శుక్రవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరకులోయ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయాలు, కూటమి అభ్యర్థుల బలాబలాలపై చర్చించుకున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన శ్రేణుల సమన్వయంలో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామని ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు.

ఎస్పీ తుహిన్ సిన్హాకు సిల్వర్ డిస్క్ అవార్డు

- ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు పురస్కారం
- ఎంపిక చేసిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



తుహిన్ సిన్హా, ఎస్పీ

పాడేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పోలీసు సేవలు అందించిన కేటగిరీలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాను సిల్వర్ డిస్క్ అవార్డుకు ఎంపిక చేసినట్టు డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణ, గంజాయి రవాణాను అరికట్టడంలో తుహిన్‌సిన్హా సమర్థంగా పనిచేస్తున్నారు. ఇంకా కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గిరిజనులతో పోలీసు శాఖ మమేకం కావడం వంటి చర్యలను పరిగణనలోకి తీసుకుని ఆయనను సిల్వర్ డిస్క్ అవార్డును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది... ఎస్పీ తుహిన్‌సిన్హాకు అభినందనలు తెలిపారు.

భీమిలిపై వీడిన ఉత్కంఠ

టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావే

- ఎట్టకేలకు ప్రకటించిన అధిష్ఠానం
- పార్టీ శ్రేణుల్లో హర్షం



విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సీనియర్ నాయకులు గంటా శ్రీనివాసరావు ఈసారి భీమిలి నుంచి పోటీ చేయనున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం శుక్రవారం ఖరారుచేసింది. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు రానున్న ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేయాలని భావించారు. ఆ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసి, అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే ఈసారి విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అక్కడ విజయం సాధిస్తే మంచి పేరు వస్తుందని వెళ్లాలని ఆదేశించారు. అయితే చీపురుపల్లి తనకు దూరం అవుతుందని, వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటుందని గంటా తన మనసులో మాట వెల్లడించారు.

అనేక తర్జనభర్జనల అనంతరం

గంటాను చీపురుపల్లి వెళ్లాల్సిందిగా సూచించిన అధిష్ఠానం భీమిలి నియోజకవర్గానికి పలువురి పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు ... మిగతా 7వ పేజీలో

మన్యంలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



పాడేరు: దేవుని మందిరంలో ప్రభు కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

పాడేరు రూరల్, మార్చి 29: మన్యంలోని వివిధ క్రైస్తవ మందిరాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు కావడంతో క్రైస్తవ భక్తులు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తును స్తుతిస్తూ సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రభువు మానవాళికి ఇచ్చిన సందేశాలను చర్చిల్లో పాస్టర్లు బోధించారు. వివిధ ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ గీతాలను గాయకులు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఎలీషారావు, ఆర్.జాన్, తిమోతి, రత్నం, క్రైస్తవులు పాల్గొన్నారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తు మరణం పురస్కరించుకుని శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు శిలువలో ఉన్న కాలం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు ప్రార్థనలు చేశారు. చింతపల్లి, డైరీనగర్ ఆదివాసీ ప్రభావిత పథం చర్చిల్లో పాస్టర్లు డి.ఈనక్, వి.సోమరాజు, క్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్, గ్లోరియర్స్ చర్చిలో పాస్టర్ విక్టర్, సెయింట్స్ ఆన్స్ పాఠశాలలో ఫాదర్ హ్యారీ ఫిలిప్ క్రీస్తు మరణంపై వాక్యోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ దయాన, ప్రిన్సిపల్ రేణు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో...


కొయ్యూరు: రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మండలాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


చింతపల్లిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సిస్టర్స్, క్రైస్తవులు

కొయ్యూరు: ప్రేమ, కరుణ, సేవ తత్వాలు జీవితాల్లోకి ప్రవేశిస్తే జీవితానికి అర్థం, పరమార్థం ఉంటుందని ఏసుక్రీస్తు తన సందేశంలో తెలిపారని మత ప్రబోధకులు పేర్కొన్నారు. శుభ శుక్రవారాన్ని మండల వ్యాప్తంగా పలు క్రైస్తవ ఆలయాలలో మత ప్రబోధకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోక రక్షకుడైన ఏసు ప్రభువు తన ఆఖరి సందేశంగా పేర్కొన్న అంశాలను బోధించారు. అలాగే ఏసుక్రీస్తు జ్ఞాపకాలను గుర్తుంచుకోవాలని కోరారు. కొయ్యూరు ఒలీవల, యునైటెడ్, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించంతో పాటు ప్రేమ, క్షమ మొదలైన గుణాలను బైబిల్ వ్యాక్యోపదేశం బోధించడంతో పాటు శిలువపై పలికిన ఏడు మాటల ప్రత్యేకతలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో మండల నలుమూలల నుంచి అనేక మంది భక్తులు సమీప చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండలంలోని క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సేవకులు ముందుగా ప్రతీ వీధిలోని ప్రభుత్వం ఆరాధనతో ప్రచారం చేశారు. అనంతరం తమ చర్చిలు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆనంతరం కేక్‌కట్ చెసి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు ఒకరికి ఒకరు తెలిపారు మిఠాయిలు కూడాను పంచిపెట్టారు మండలంలోని క్రైస్తవ సోధరి సోదరులు పండుగా కళ సందడి జరిగింది ఈ కార్యక్రమనికి సేవకులు కామయ్య ఆనంద్ బుజ్జి ప్రసాద్ అరుణ చంద్రశేఖర్ ఉమామహేశ్వరి సుజాయ్ శ్రీకాంత్ ప్రధిష్ సాయి భవన కువ్విత తదితరులు పాల్గొన్నారు

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం క్రీస్తు మరణించిన రోజు కావడంతో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. చాపరాతిపాలెం ఆదివాసీ ప్రభావిత పథం చర్చిలో పాస్టర్ కంకిపాటి ఈశ్వరరావు, సిరిబాల చర్చిలో పాస్టర్ వసుపరి తిమోతి, దేగలపాలెం క్రీస్తు మరణంపై వాక్యోపదేశం చేశారు. గుడ్‌ఫ్రైడేకు గుర్తుగా చర్చీలకు క్రైస్తవులు సిలువలను తీసుకొచ్చారు. పలు గ్రామాల్లో క్రైస్తవులు శిలువలు పట్టుకుని ర్యాలీలు చేశారు.


పాడేరు ప్రార్థనా మందిరంలో క్రీస్తు వ్యాఖ్యోపదేశం చేస్తున్న పాస్టర్లు

పోలీసులకు మౌలిక సదుపాయాలు

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా


బ్యారాక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

జి.మాడుగుల, మార్చి 29: పోలీసులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలుగా బ్యారాక్ నిర్మాణం చేపట్టామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగంణంలో నిర్మించిన పోలీస్ బ్యారాక్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నాలుగు గదులతో కూడిన బ్యారాక్ సిబ్బందికి ఎంతగానో ఉపయోకరమని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రశాంత ఎన్నికలకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.ధీరజ్, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ ఉదయ్‌కుమార్, సీఐ రమేశ్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో టీడీపీ శ్రేణుల సంబరాలు

» అసెంబ్లీ టిక్కెట్ టీడీపీకి కేటాయించడంపై హర్షం


పాడేరులో ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పాడేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పాడేరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీకి కేటాయించడం, కేవీ.రమేశ్‌నాయుడును అభ్యర్థిగా ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఇక్కడ సంబరాలు జరుపుకొన్నాయి. పాతపాడేరులో ముదుంగా బాణసంచా కాల్చి, ఊరేగింపుగా ఎన్‌టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ, జనసేన పార్టీల సహకారంతో తమ అభ్యర్థిని గెలిపించుకుంటామని ఈ సందర్భంగా టీడీపీ నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా నరసింహమూర్తినాయుడు, కె.వెంకటరత్నం, ఉల్లి రామారావు, బొంజుపడాల్, సూర్యకాంతం, శోభా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ దక్కలేదని గిడ్డి ఈశ్వరి వర్గీయుల ఆగ్రహం


టీడీపీ పోస్టర్లను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు

పాడేరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి టికెట్ దక్కకపోవడంపై ఆమె వర్గీయులైన టీడీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి ఆగ్రహానికి గురయ్యారు. ఆరున్నరేళ్లుగా నియోజకవర్గంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేసిన ఈశ్వరికి కాకుండా, పార్టీకి కోసం పని చేయని కేవలం రెండు నెలల క్రితం పార్టీలోకి వచ్చిన రమేశ్‌నాయుడుకి స్థానిక ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం ఏంటని పార్టీ నేతలు, కార్యకర్తలు అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం పని చేసిన గిడ్డి ఈశ్వరికి అన్యాయం చేసి, పార్టీతో పెద్దగా సంబంధం లేని వ్యక్తికి టికెట్ ఇవ్వడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ నేతకు అన్యాయం చేసినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని అన్నారు. ఈసందర్భంగా టీడీపీ కరపత్రాలు, పోస్టర్లను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా పునాదుల్లోనే..

... 5వ పేజీ తరువాయి

క్యాబిన్, రిసెప్షన్ కౌంటర్, సిబ్బంది గది, రికార్డు గది, ఎంఐఎస్ సెంటర్, ఏఎస్‌వో, సర్వేర్, ఎంఆర్‌ఐ, ఏఆర్‌ఐలకు ప్రత్యేకంగా గదులు కేటాయించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, వాష్ రూమ్‌లు వున్నాయి. మొదటి అంతస్తులో వీడియో కాన్ఫరెన్సు హాల్, రెగ్యులర్, పౌరసరఫరాల డీటీల క్యాబిన్లు వుంటాయి. అలాగే పౌరసరఫరాల కార్యాలయానికి కూడా ఒక గదిని కేటాయించారు.

వసతి సమస్యతో ఉద్యోగుల ఇక్కట్లు

ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం నిర్వహిస్తున్న భవనం చిన్నది కావడంతో వసతి సమస్యతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనం కావడంతో వర్షం కురిస్తే పలుచోట్ల కారిపోతున్నది. వీడియో కాన్ఫరెన్సు గది ఇరుకుగా వుంది. ఆర్ఐ, డీటీ, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు కూర్చునేందుకు ప్రత్యేక గదులు లేవు. మొత్తం నాలుగు గదుల్లోనే ఉద్యోగులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పేరుతో డబ్బులు పంచడం తప్ప, అభివృద్ధి పనులను పట్టించుకోలేదని, ఇందుకు తహసీల్దారు కార్యాలయం నూతన భవనం ఒక ఉదాహరణ అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రభుత్వం మారిపోయి, కొత్త ప్రభుత్వం ఏర్పడితే తప్ప రెవెన్యూ కార్యాలయానికి కొత్త భవనం సమకూరదని అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

పాడేరు రూరల్, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏజెన్సీలో ఘనంగా నిర్వహించారు. పాడేరు మండలంలోని నక్కలపుట్టు పంచాయతీ కిండంగి గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పార్టీలకతీతంగా తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఎన్టీఆర్ చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, నాయకులు వి.దేముడు, ఎస్.సుమన్, భోపాల్, కృష్ణమరాజు, కె.రాజేష్ పాల్గొన్నారు.


పాడేరులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగరాజు, నాయకులు

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండల కేంద్రం డుంబ్రిగుడలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదల పెన్నిధి ఎన్టీఆర్‌యేనని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. టీడీపీని బలోపేతం చేసి రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు సుభీక్షంగా ఉండే విధంగా కృషి చేద్దామన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనతో ముందుకెళ్లి అరకు నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగుర వేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కమ్మిడి సుబ్బారావు, మాజీ ఎంపీపీ దన్నెరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

చింతపల్లిలో...

చింతపల్లి: రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సాయినగర్‌లోని ఎన్టీఆర్ చిత్రపాటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని సొంతం చేసుకున్న ఏకైక పార్టీ తెలుగుదేశమన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో బలమైన కార్యకర్తలు పార్టీని ముందుకు తీసుకొని వెళుతున్నారన్నారు. ఒక్క అవకాశమివ్వండీ అంటూ గద్దెనెక్కిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు అసంతృప్తికి వ్యక్తం చేస్తున్నారన్నారు. 175 సీట్లు సాధిస్తామని కలలు కంటున్న జగన్‌రెడ్డికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అడ్రస్ లేకుండా పోతుందన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు ఐక్యతగా పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, లక్కోజు నాగభూషనం, ఆంద్రాబు లక్ష్మణ్, మంగు, రమణ, అప్పారావు, సోమేశ్ పాల్గొన్నారు.

అటవీ సంపద పరిరక్షణ బాధ్యత ప్రజలదే

» అనకాపల్లి జిల్లా డివిజన్ ఫారెస్టు అధికారి జగన్నాథ్‌సింగ్

కొయ్యూరు, మార్చి 29: అటవీ శాఖ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చేసిన టేకు ప్లాంటేషన్లు అక్రమార్కుల కన్ను పడకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రజలదేనని, అటవీ సంపదను కాపాడాలని అనకాపల్లి జిల్లా డివిజన్ ఫారెస్టు అధికారి జగన్నాథ్‌సింగ్ కోరారు. శుక్రవారం సాయింత్రం డీఎఫ్‌వో కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ సిబ్బందితో కలసి మండలంలోని నల్లగొండ గ్రామ అటవీ భూమిలో 1962లో చేసిన టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం వేసవి నడుస్తున్నందున అడవులలో వంటచెరకు తదితర అవసరాలకు వెళ్లిన వారు అగ్ని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పాటించాన్నారు. అలాగే 1962-63లో వేసిన టేకు ప్లాంటేషన్‌లో అపరిచతులు కదలికలు ఉంటే వెంటనే సమాచారమివ్వాలన్నారు. అటవీ సంపదను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఎక్కువ ఉందని, అక్రమార్కులు బారిన టేకు తోట పడకుండా పరిరక్షించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో సునీల్ రేంజర్ వెంకటరమణ, గార్డులు వెంకటరావు, ఎరుకులమ్మ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ వాసులకు సూచనలు ఇస్తున్న డీఎఫ్‌వో జగన్నాథ్ సింగ్

పోలీసుల ముమ్మర తనిఖీలు

సీలేరు, మార్చి 29: గూడెంకొత్తవీధి మండలంలోని మేజర్ పపంచాయతీ సీలేరులో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా ఏపీ జెన్‌కో చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గడ్ ప్రాంతాల నుంచి మద్యం, డబ్బులను అక్రమంగా సరఫరా అవుతుందన్న నిఘా వర్గాల హెచ్చరికల మేరకు బస్సులతో సహా ఇతర ప్రైవేటు వాహనాలను కూడా అణువణువునా తనిఖీ చేస్తున్నారు. ఎవరి వద్దనైనా నిబంధనల కంటే అధికంగా నగదు ఉంటే, వాటికి తగిన ఆధారాలు చూపకపోతే అటువంటి సీజ్ చేస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు. అలాగే ఎన్నికల సందర్భంగా మావోయిస్టుల ఎటువంటి అసాంఘి కార్యకలాపాలకు పాల్పడకుండా సరిహద్దుల్లో గాలింపు చర్యలు కూడా ముమ్మరం చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు సీలేరు తనిఖీ కేంద్రం కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.


సీలేరు మీదుగా వచ్చిపోయే బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసులు

బాబోయ్ ఎండలు...

» ఆరంభంలోనే భగ్గుమంటున్న భానుడు.. పెరిగిన వేడి

» నర్సీపట్నంలో 38 డిగ్రీల నమోదుతో జనం బెంబేలు

నర్సీపట్నం, మార్చి 29: వేసవి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. గత రెండుమూడు రోజులుగా వేడి మరీ ఎక్కువగా ఉంటుండడంతో జనం అల్లాడుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మున్ముందు పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. నర్సీపట్నంలో గత వారం రోజులుగా 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే, శుక్రవారం 38డిగ్రీలుగా నమోదైంది. దీంతో మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పట్టణంలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. పనులపై బయటకు వచ్చినవారిలో కొందరు గొడుగులు వేసుకుని రాగా, మహిళలు చీరచెంగులు కప్పుకుని కనిపించారు. ఎండలు ఇప్పుడే ఇంతలా ఉంటే ఏప్రిల్, మేలో పరిస్థితి ఏమిటని జనం భయపడుతున్నారు.

పది కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

గొలుగొండ, మార్చి 29: పది కిలోల గంజాయితో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని ఎర్రన్నపాలెం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నామన్నారు. ఇంతలో బైక్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన పి.పరమాన్ అనే వ్యక్తి గంజాయిని తరలిస్తుండగా గుర్తించినట్టు చెప్పారు. గంజాయితో పాటు బైక్, పాటు, రూ.నాగులు వేల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

3,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

దేవరాపల్లి, మార్చి 29: మండలంలోని రైవాడ జలాశయం ఒడ్డున బొడ్డపాడు వద్ద నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచి మూడు వేల ఐదు వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేశామన్నారు. ఈ ఘటనలో సారా తయారీకి సిద్ధం చేసిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

☛ సంక్షిప్తంగా..

మోదకొండమ్మకు వెండి హారతి కుందె వితరణ

పాడేరు రూరల్, మార్చి 29: గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మకు ఓ భక్తుడు వెండి హారతి కుందెను శుక్రవారం అందించారని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి రమేష్‌నాయుడు తెలిపారు. పాడేరు పట్టణంలోని గుడివాడవీధికి చెందిన ఎర్రవరపు సురేష్‌కుమార్ దంపతులు రూ.22 వేల విలువైన హారతి కుందెను ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం చేతులు మీదుగా అమ్మవారికి సమర్పించారన్నారు. ఈ మేరకు ఆ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాడేరు అభ్యర్థిపై పునరాలోచించాలి

కొయ్యూరు, మార్చి 29: పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అధినేత పునరాలోచించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దుచ్చరి చిట్టిబాబు, టీఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు అనిశెట్టి చిరంజీవి తదితరులు కోరారు. పార్టీ అభ్యర్థిగా రమేష్‌నాయుడును అధినేత ప్రకటించడంతో వారంతా సమావేశమయ్యారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి జెండా మోస్తున్న సీనియర్లను కాదని రమేష్‌కు ఇవ్వడం తగదని పేర్కొన్నారు. ఈ విషయంలో పునరాలోచించి సీనియర్లకు టిక్కెట్ కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకురు చంద్రరావు, వరహాలబాబు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదబయలులో భారీ వర్షం


రోగులపేటలో కురుస్తున్న వర్షం

పెదబయలు, మార్చి 29: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు పలు చోట్ల ఉదయం నుంచి ఎండలు మండి పోయింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వడగండ్ల వాన పడింది. ఈ వర్షంతో వేడిమి నుంచి కాస్త ఉపశమనం లభించినట్టయిందని గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

ముంచంగిపుట్టులో చిరు జల్లులు

ముంచంగిపుట్టు, మార్చి 29: మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఠారెత్తించింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం మబ్బుగా మారి మోస్తరు వర్షం పడింది. ఎండ వేడికి విలవిలలాడిన ప్రజలు అకాల వర్షం కారణంగా కాస్త ఉపశమనం పొందారు. ఈ వర్షాలు మామిడి పూతకు ఎంతో మేలు చేకూరస్తాయని గిరి రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ముత్యాలమ్మ జాతరకు సహకరించాలి

» ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినాయకరావు

చింతపల్లి, మార్చి 29: మన్యం ప్రజల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ జాతర విజయవంతానికి అందరూ సహకరించాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుపులేటి వినాయకరావు పిలుపునిచ్చారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ, భక్తులు ఎన్నికల నియమావళి పాటిస్తూ జాతర జరుపుకోవాలని చెప్పారు. మే 5 నుంచి 8వ తేదీ వరకు జాతర జరుగుతుందని, సంబరం 6వ తేదీన ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అమ్మవారి జాతరకు ఈ ఏడాది ఎన్నికలు, సెలవులు కలిసిరావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, కోశాధికారి గసాడి పద్మనాభం, ఉత్సవ కమిటీ నాయకులు బౌడు గంగరాజు, యూవీ గిరి, కుడుముల వెంకటరమణ, తాటిపాకల నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణమూర్తి, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఆధారంగా పింఛన్లు పంపిణీ చేయండి

చింతపల్లి, మార్చి 29: ఎన్నికల ప్రవర్తన నియమావళిని వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లు పాటిస్తూ పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో వీర సాయిబాబు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీ సమయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు నియమామళి ఉల్లంఘించరాదన్నారు. పింఛన్ పంపిణీ సమయంలో ఎటువంటి చిత్రాలు, వీడియోలు చిత్రీకరించరాదన్నారు. లబ్ధిదారులతో ఎన్నికలపై చర్చించడం, రాజకీయాలు పార్టీలకు మద్దతుగా ప్రచారం చేయరాదన్నారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొయ్యూరు, మార్చి 29: మండలంలో లుబ్బుర్తి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చీడిపాలెం పంచాయతీ శింగవరానికి చెందన మామిడి ప్రసాద్ (35) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి కృష్ణాదేవిపేట నుంచి శింగవరం వెళుతూ లుబ్బుర్తి వంతెన సమీపంలో అదుపుతప్పి ప్రసాద్ ప్రమాదం బారిన పడ్డాడు. అదే దారిలో వస్తున్న వాహన చోదకులు ప్రమాదాన్ని గుర్తించి అంబులెన్సుకు సమాచారం అందించి, రాజేంద్రపాలెం పీహెచ్‌సీకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. రెండు రోజులుగా అక్కడ వైద్య సేవలు పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం ప్రసాద్ మరణించారు. కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థుల కోసం పాటుపడతాం..’

పాడేరు రూరల్, మార్చి 29: జిల్లాలోని అరకు పార్లమెంట్, అసెంబ్లీ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడతామని బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్ అన్నారు. ఉమ్మడి అభ్యర్థుల విజయంపై విస్తృత ప్రచారానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మోదీ అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలు, జనసేనాని పవన్ కల్యాణ్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు సల్లా రామకృష్ణ, కె.వెంకటరమణ, సింహాచలం, అనంతయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

క్రైం... crime news

గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న 13 మంది అరెస్టు

▸ రూ. 37,130 నగదు స్వాధీనం

సబ్బవరం, మార్చి 29 : మండలంలోని పలు ప్రాంతాల్లో గుళ్లాట, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న 13 మందిని దాడి పట్టుకున్నామని, వారి వద్ద నుంచి రూ.37,130 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలునాయుడుపాలెం శివార్లలో లూడో ఆన్‌గేమ్ ఆడుతున్న సమాచారం మేరకు గురువారం రాత్రి దాడి చేసి ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.13,130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.అదేవిధంగా అమృతపురం సమీపంలో శుక్రవారం గుళ్లాట ఆడుతున్న వారిపై దాడి నలుగురుని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.14 వేలు నగదును స్వాధీనం చేసుకున్నాన్నారు. ఎ. సిరసపల్లి శివార్లలో పేకాట(కోత ఆట) ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 10 వేలు నగదు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అరెస్టు చేసిన 13 మంది అనకాపల్లి కోర్టుకు తరలించినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

శిరిజాంలో అగ్నిప్రమాదం

▸ 13 పశువుల పాకలు ,15 ధాన్యం గడ్డిమేట్లు దగ్ధం

▸ రూ.15 లక్షల వరకూ ఆస్తినష్టం



ప్రమాదంలో దగ్ధమైన పశువుల పాకలు, ధాన్యాన్ని భద్రపర్చే గడ్డిమేట్లు

చీడికాడ, మార్చి 29 : మండలంలోని శిరిజాం గ్రామం గుంపానవారి పశువులపాకల వద్ద శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం జరిగినట్టు బాధితులు వాపోతున్నారు. ఉదయం తొమ్మిదిన్న గంటల సమయంలో రైతులు పొలం పనులకు వెళ్లిన తరువాత విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుంపాన లక్ష్మణ పశువుల పాకల వద్ద మంటలు చెలరేగాయి. వీటిని అక్కడివారు గుర్తించి సంబంధిత రైతులకు తెలపడంతో వారు వచ్చారు. అప్పటికే పశువులపాకలు, గడ్డిమేట్లు దగ్ధమవుతున్నాయి. ఈ ఘటనలో పదిహేను కుటుంబాలకు చెందిన 13 పశువులపాకలు, 15 ధాన్యం భద్రపర్చే గడ్డిమేట్లు దగ్ధమయ్యాయి. మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి అప్పటికి ఉన్న మంటలను ఆర్పారు. ఇదిలావుంటే, గడ్డిమేట్లలో నిల్వచేసుకున్న తిండిగింజలు, ఎన్నో ఏళ్లగా ఉన్న చింతచెట్లు కాలిపోయాయని బాధిత రైతులు వాపోతున్నారు. వీఆర్వో కోడూరు శేఖరరావు నష్టం వివరాలను సేకరించారు. టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పైలా ప్రసాదరావు, ఈర్లె అనూరాధలతో పాటు గొల్లవిల్లి రాజబాబు, పుట్టా రామ్‌కుమార్, రెడ్డి సన్యాసినాయుడు, పంచాడ దాలెంనాయుడు తదితర నాయకులు బాధితులను పరామర్శించారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, మార్చి 29 : పట్టణంలో కొనుగోలు చేసి 25 మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. కశింకోట మండలం చెరకాం గ్రామానికి చెందిన గులిమి సంతోష్ మద్యం షాపులో 15 బాటిళ్ల కొనుగోలు చేసి సంచిలో పెట్టుకుని వెళుతుండగా రింగురోడ్డులో పట్టుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఎలమంచిలి మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన అనసూరి సన్యాసిరావు పది మద్యం బాటిళ్లతో వెళుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

▸ ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మార్చి 29: మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని, వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ ప్రమాదంలో విశాఖపట్నంకు చెందిన మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందగా, విశాఖకు చెందిన బీవీఎస్.కృష్ణ, కె.ధీరకుమార్‌లకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. పులపర్తి జంక్షన్ సమీపంలో తుని నుంచి విశాఖ వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ టీ తాగేందుకు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే సమయంలో భీమవరం నుంచి విశాఖ వైపు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిలో కారు డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శివకుమార్ ఆస్పత్రిలో మృతి చెందగా.. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు విశాఖలోని వైభవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని, కార్యాలయ పని మీద భీమవరం వెళ్లి తిరిగి విశాఖ వస్తుండగా ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడి అరెస్టు

నర్సీపట్నం అర్బన్, మార్చి 29 : బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భీమరాజు శుక్రవారం తెలిపారు. మండలంలోని దుగ్గాడ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక బుధవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నాతవరం మండలం గునిపూడికి చెందిన పోలిపల్లి సాయి తనపై అత్యాచారానికి యత్నించినట్టు బాలిక ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, విచారణ అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, మార్చి 29 : మండలంలోని అచ్చెర్ల గ్రామానికి 9 మద్యం బాటిళ్ల తీసుకువస్తున్న వెలగా మాణిక్యంను పట్టుకున్నట్టు ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.మల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం గ్రామంలో తనిఖీ నిర్వహిస్తుండగా గోనె సంచిలో తీసుకెళుతున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోదీ మరొకసారి అధికారం చేట్టడం తథ్యం

▸ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



సింహాచలంలో తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న సీఎం రమేశ్

సింహాచలం, మార్చి 29: కేంద్రంలో మరొకసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆయన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ జరుగుతున్న సుదర్శన నారసింహ యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ అప్పన్నకు కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు చూపుతున్న అభిమానం చూస్తుంటే అనకాపల్లి స్థానం నుంచి తన విజయంతో పాటు కేంద్రంలో నరేంద్రమోదీ సారథ్యంలో భాజపా ప్రభుత్వం మరోసారి పగ్గాలు చేపట్టడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఆయన వెంట నగర భాజపా అధ్యక్షులు మేడపాటి నరేంద్ర పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419



లంకెలపాలెం సమీపంలోని ఈ-మర్రిపాలెం కూడలి వద్ద సీఎం రమేశ్‌కు గజమాల వేస్తున్న జనసేన శ్రేణులు



అనకాపల్లి పట్టణంలో జరిగిన సమావేశానికి హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకం



అనకాపల్లి సభలో సీఎం రమేశ్‌ను ఆలింగనం చేసుకున్న టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి అయ్యన్నపాత్రుడు. చిత్రంలో కొణతాల రామకృష్ణ, పీలా గోవింద

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

కాలుష్యంతో పర్యావరణానికి పెనుముప్పు

▸ పారిశుధ్య సమస్యతో ప్రజల అవస్థలు

▸ మృత్యువాత పడుతున్న మూగజీవాలు

▸ కాగితాలకే పరిమితమైన నిషేధం అమలు



మండలంలో వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, సంచులు.

సబ్బవరం, మార్చి 29:

పర్యావరణానికి పెను ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రజలంతా అవస్థలు పడుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధమున్నా ప్రజల్లో అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కాలుష్యానికి కారణ భూతాలవుతున్నాయి.

ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లో మాత్రమే పాలిథిన్ సంచుల వినియోగం ఉండేది. ప్రస్తుతం మారుమూల చిన్న పల్లెల్లో కూడా వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. మండలంలోని 24 పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి కార్యక్రమానికి ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లలో సామగ్రి వినియోగించడం ప్రజలకు వ్యసనంలా మారిపోయింది. సబ్బవరం మేజరు పంచాయతీలోనూ నిత్యం లెక్కలేనంతగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. రోడ్ల పక్కన, షాపులు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.



అమలు కాని ప్లాస్టిక్ నిషేధ చట్టం

పర్యావరణానికి ముప్పు తెచ్చే 40 మైక్రాన్‌ల కంటే తక్కువ దళసరి ఉన్న ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం 2011లో పూర్తిగా నియంత్రించింది. నిషేదం అమల్లోకి వచ్చి 8 ఏళ్ల గడుస్తున్నా... కనీస స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగం తగ్గకపోగా, నానాటికీ పెరిగిపోతూనే ఉంది. అయినా అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. నిత్యావసర సరుకులు చేరవేత నుంచి ఆహారం ప్యాకింగ్ వరకు ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. విందు, వినోదాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వాడకం అలవాటుగా మారిపోయింది. వినియోగించిన ప్లాస్టిక్ సంచులను డంపింగ్ యార్డులకు తరలించినా, అవి కుప్పలుగా పేరుపోతున్నాయే తప్ప భూమిలో కలిసే పరిస్థితి లేదు. డ్రైనేజీలు, పంట కాలువలు ఈ ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, ఇతర మూగ జీవాలు తినేస్తుండడంతో అవి కూడా మరణించే పరిస్థితి దాపురించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగించే విషయం. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు పాలిథిన్ వాడకంపై కఠిన నిర్ణయాలు తీసుకొని, నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళి అమలెక్కడ?

▸ జీపీ అగ్రహారంలో నీటి పథకంపై తొలగించని జగన్, మోదీ చిత్రాలు

▸ పట్టించుకోని అధికారులు



నీటి పథకంపై తొలగించని జగన్, మోదీ చిత్రాలు

అచ్యుతాపురం, మార్చి 29: మండలంలోని నునపర్తి పంచాయతీ జీపీ అగ్రహారంలో అధికారులు ఎన్నికల నియమావళి అమలు కాలేదు. అక్కడ సోలార్ పవర్‌తో నిర్మించిన నీటి పథకం వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఫొటోలు ఉన్న బోర్డును తొలగించలేదు. కనీసం పేపర్లు కూడా అంటించలేదు. అలాగే సమగ్ర భూసర్వే హద్దురాళ్లపై వైఎస్సార్ జగనన్న భూరక్ష అన్న వాటిని తొలగించలేదు.

ఇక.. ఎంపీడీఓ కార్యాలయం పక్కనే జెడ్‌పీ అతిథిగృహం శిలాఫలకంపై తూతూ మంత్రంగా కాగితాలు అంటించారు.

అవి ఊడిపోయినా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.



ఎయిర్‌పోర్టులో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు సభ్యులు రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, కేఎల్ రాహుల్



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ సౌరవ్ గంగూలీ, జట్టు సభ్యులు కుల్దీప్ యాదవ్, ఇషాంత్ శర్మ, డేవిడ్ వార్నర్

విశాఖ చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు

▸▸ ఇరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రేపు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 29: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 31న జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లో పాల్గొనే చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల ఆటగాళ్లు శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. శుక్రవారం నగరానికి చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్లలో ఎంఎస్ ధోనీతోపాటు రుతురాజ్ గైక్వాడ్, రహానే, షేక్ రషీద్, సమీర్ రిజ్వీ, రవీంద్ర జడేజా, మిశ్చెల్, శివం దుబే, అవినాష్ రావు, రాజవర్ధన్, దీపక్ చాహర్, ప్రశాంత్ సోలంకి, నిశాంత్ సింధు, రచిన్ రవీంద్ర, శార్దూల్ ఠాకూర్, దుషార్ దేశ్ పాండే, తదితరులు ఉన్నారు. విమానాశ్రయం నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లేందుకు సీఎస్‌కే ఆటగాళ్లు బస్సు ఎక్కుతున్న సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. ధోనీ..ధోనీ అని నినాదాలు చేశారు. కాగా, ఇప్పటివరకు జరిగిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి మూడో మ్యాచ్‌లో పాల్గొనేందుకు విశాఖ చేరిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా మహేంద్రసింగ్ ధోనీ అభిమానులు మ్యాచ్‌పై ఆసక్తిగా ఉన్నారు.

తిరిగి నగరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్

గురువారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు తిరిగి శుక్రవారం హోమ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు... అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం సాయంత్రం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

భీమిలిపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

నెల్లిమర్ల పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పేర్లను తొలుత పరిశీలించింది. ఆ తరువాత భైరా ఫౌండేషన్ ఛైర్మన్ దిలీప్ చక్రవర్తి పేరును కూడా జాబితాలో చేర్చింది. ఈ ముగ్గురిలో ఒకరికి భీమిలి టిక్కెట్ ఇవ్వాలని భావించింది. అయితే గంటా శ్రీనివాసరావు చివరి వరకు చేసిన ప్రయత్నాలు, భీమిలిలో సీనియర్ నాయకులే బరిలో ఉండాలని పార్టీ అధినేత భావించడంతో గంటా పేరునే ఖరారు చేశారు. తనకు టికెట్ కేటాయించినందుకు చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గంటా పేరును ప్రకటించగానే భీమిలిలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి హర్షాతికేరాలు వ్యక్తంచేశాయి. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు.

ఒకసారి ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు

గంటా శ్రీనివాసరావు 1999లో రాజకీయ అరంగేట్రం చేశారు. తెలుగుదేశం పార్టీ తరఫున అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన ఐదు ఎన్నికల్లో పోటీ చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి ఎంపీగా గెలిచిన తరువాత 2004 ఎన్నికల్లో చోడవరం నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009 ఎన్నికల సమయంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించగా ఆ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సీనియర్ నాయకులైన దాడి వీరభద్రరావు (టీడీపీ), కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)లపై గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున భీమిలి నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కర్రి సీతారామ్‌పై 37 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు. గత 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బరిలో దిగి వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై పైచేయి సాధించి ఎమ్మెల్యే అయ్యారు. రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో మౌలిక వసతుల శాఖ మంత్రిగా, 2019లో చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఏనాడు కూడా ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీ చేయలేదు. అయితే తన రికార్డును తానే బ్రేక్ చేసుకొని ఈసారి భీమిలి నుంచి పోటీ చేయబోతున్నారు.

కారు ఢీకొన్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కె.కోటపాడు, మార్చి 29 : కారు ఢీకొని తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. చౌడువాడ గ్రామానికి చెందిన ఆళ్ల నూకరాజు (35) గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తన పొలంలోకి నడిచి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో అతివేగంగా వెళుతూ నూకరాజును ఢీకొన్నారన్నారు.

అనంతరం కారు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని రోడ్డు నుంచి కిందకి బోల్తా పడి నుజ్జయిందన్నారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతిచెందినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

అనకాపల్లి టౌన్, మార్చి 29: రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్న గవరపాలెంలోని 22వ వార్డు సచివాలయ వలంటీర్ కె.శివకృష్ణను విధుల నుంచి తొలగించినట్టు జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు శుక్రవారం తెలిపారు. ఈనెల 26వ తేదీన నూకాంబిక ఆలయ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జరిగిన వైసీపీ సమావేశానికి వలంటీర్ శివకృష్ణ హాజరైనట్టు అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారికి ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు శివకృష్ణను విధుల నుంచి తొలగించినట్టు ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ విస్తృతంగా చేపట్టాలి ఎస్పీ కేవీ మురళీకృష్ణ



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సలహాలు, సూచనలు చేస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

పరవాడ, మార్చి 29: ఎన్నికల నేపథ్యంలో వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సిబ్బందికి సూచించారు. దేశపాత్రునిపాలెం వద్ద గల చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా వాహన తనిఖీలు చేయడంతోపాటు డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టాలన్నారు. అలాగే ఉచిత కానుకల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

మాక్ కౌంటింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



మాక్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవి

అనకాపల్లి టౌన్, మార్చి 29: జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద గల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న మాక్ కౌంటింగ్‌ను పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్ల నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. చిన్న తప్పునకు అవకాశం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సీఎం రమేశ్ దంపతులు

▸ సత్కరించిన దాడి రత్నాకర్, జయవీర్



సీఎం రమేష్ దంపతులను సత్కరిస్తున్న దాడి రత్నాకర్, జయవీర్

అనకాపల్లి టౌన్, మార్చి 29 : స్థానిక నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో శుక్రవారం రాత్రి బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ శ్రీదేవి దంపతులు, కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాడి జయవీర్ సాదర స్వాగతం పలికారు. దగ్గరుండి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం సీఎం రమేశ్ దంపతులకు గజమాల వేసి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ అర్చకులు సీఎం రమేష్ కుటుంబసభ్యులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం

▸ భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



వాహనం పైనుంచి మాట్లాడుతున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

లంకెలపాలెం, మార్చి 29: బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు శుక్రవారం లంకెలపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ముఖ్య నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత, పీలా గోవింద సత్యనారాయణ, పైలా ప్రసాదరావు, గవిరెడ్డి రామానాయుడు, సుందరపు విజయ్‌కుమార్, బుద్ధ నాగజగదీశ్, పీఎస్ మాధవ్, ప్రగడ నాగేశ్వరరావు క్రేన్ సాయంతో సీఎం రమేశ్‌కు గజమాల వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. తనకు స్వాగతం పలికేందుకు భారీగా తరలి వచ్చిన కూటమి పార్టీల శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభివాదం చేస్తూ అక్కడి నుంచి ర్యాలీగా అనకాపల్లి బయలుదేరారు. అంతకుముందు జిల్లా ముఖ ద్వారం ఈ-మర్రిపాలెం కూడలి వద్ద జనసేన శ్రేణులు సీఎం రమేశ్‌కు గజమాలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో నేతలు దుల్ల రామునాయుడు, కరణం నరసింగరావు, రెడ్డి నగేశ్, మోటూరి సన్యాసినాయుడు, సోమశేఖర్, సర్వసిద్ధి సన్యాసిరాజు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు. కాగా, జనసేన సైనికులు భారీగా తరలి రావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి.